# ఈడు – జోడు

కీ ఇచ్చిన బొమ్మలా వాళ్లు పిలవాలేగాని సాధారణంగా ఏ పెళ్ళి కయినా వెళ్ళిపోవడం నా కలవాటు. ఎందుకనంటే, అక్కడ అందర్నీ కలుసుకోవచ్చు. ఆనందంగా గడపవచ్చు. మా కజిన్స్ పదిమందిదాకా వున్నారు. వాళ్ళందరూ వస్తే చాలు సందడికి.

లత పెళ్ళికి అందరం వెళ్ళాం. అనుకున్నదానికన్నా ఆనందంగా లగ్నం అయిపోయింది. భోజనాలకి టైముండడంతో అందరం వాకిట్లోకి చేరాం. పెళ్ళికి వచ్చిన వాళ్ళందరూ విడిచిన జోళ్ళు అక్కడ కుప్పగా పడివున్నాయి. అన్ని చెప్పుల్ని అలా చూడగానే నాకో చిలిపి ఆలోచన వచ్చింది.

"వురేయ్! ఇంతవరకూ లోలోపల ఈడు కుదిరిన దంపతులని చూసి ఆనందించాం ఇప్పుడు జోళ్ళని చూసి ఆనందిద్దాం. రాఘవా! నీ చెప్పులు బాగా పాతవై పోయినట్లున్నాయిరా! వీటిలో ఏవి కావాలో ఏరుకో" అన్నాను దానకర్ణుడిలా.

"నాకు ఆ బ్రౌన్‌కలర్ చెప్పుల్స్ బావున్నాయి." వెంటనే ఓ జతను సెలెక్ట్ చేసేసుకున్నాడు రాఘవ.

మా గోలలో మేమలా గుమ్మందగ్గర నిలుచుని గొడవ చేస్తుంటే బయటకు వచ్చేవాళ్ళకి అడ్డమేమో అనే విషయం కూడా ఆలోచించలేదు.

పెద్దవాళ్ళయితే ఏదో కుర్రకారులే అని మమ్మల్ని తప్పించుకుని అటో ఇటో వెళ్ళిపోతున్నారు. ఉత్సాహంవున్న కుర్రకారైతే అంతకు ముందు పరిచయం లేకపోయినా మాతో జాయినై పోతున్నారు.

నవ్వులు ... కేరింతలు....

"ప్చ .... లాభం లేదు. చెప్పులు బావున్నాయిగాని చిన్నవై పోయాయి." నిట్టూర్చాడు రాఘవ.

"నీకు సరిపోతాయేమో చూడరా వేణూ!''

''బాడ్‌లక్....నాకు పెద్దవయ్యాయి.''

''శ్రీనూ, నీకో....?''

''ప్చ...."

అలా ఒకళ్ళనొకళ్లు ప్రశ్నించుకుని అక్కడున్న అందరం చూసాం కానీ, ఎవరికీ సరిగ్గా సరిపోలేదు.

అంతవరకూ మాట పలుకూ లేకుండా మా గోలని చూస్తూ, కళ్ళ తోనే ఆనందాన్ని వ్యక్తపరుస్తున్న తన ప్రక్కనున్న వ్యక్తిని పలకరించాడు వేణు - "ఈ జోళ్ళు మీకయినా సరిపోతాయో లేదో చూడండ మాష్టారూ" అంటూ.

అతను వేసుకున్నాడు.

సరిగ్గా సరిపోయాయి.

"మీకు చక్కగా సరిపోయాయి, ఉంచేసుకోండి." ఉచిత సలహా పారేశాడు వేణు.

"ఉంచేసుకోక ఛస్తానా-వందరూపాయలు పెట్టి ఏరి, కోరి కొనుకున్నవాటిని!'' చిన్నగా నవ్వాడతను.

నిముషంపాటు మా ఎవరినోటా మాటలేదు.

(స్వాతి సపరివారపత్రిక)